



అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

పూర్తయిన పనులకు బిల్లులు మంజూరు

కలెక్టర్ ఎం.గౌతమి



కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వివిధ శాఖల ద్వారా పూర్తయిన పలు అభివద్ధి పనులకు పూర్తి స్థాయిలో బిల్లులు మంజూరు చేశామని కలెక్టర్ ఎం.గౌతమి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా 492 పనులు పూర్తి అయ్యాయన్నారు. ఇందులో 315 పనులకు బిల్లులు అప్లోడ్ చేశామన్నారు. 230 పనులకు రూ.7.59 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి రూ.29.03 కోట్లు, సిసి రోడ్లు, బీటీ రోడ్లు, సిసి డ్రెయినేజీ పనులకు సంబంధించి రూ.39.48 కోట్లు, ఉద్యానవన మొక్కలకు సంబంధించి రూ.10.64 కోట్లు, (జిజిఐ) రూ.0.27 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో చెత్త సేకరణ (ఎరువు మరియు పొడి, తడి చెత్త)కు రూ.066 కోట్లు, ఇతర పనులకు రూ.0.80 కోట్ల కలిపి మొత్తం రూ.80.88 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణ పారిశుధ్య, నీటి సరఫరాల శాఖకు సంబంధించి జిల్లాలో 2023- 24 సంవత్సరంలో జలజీవన్ మిషన్ పథకం కింద 587 బిల్లులకు గాను సుమారు రూ.9.14 కోట్ల రూపాయలతో మొత్తం ఖర్చు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ ద్వారా జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా 38,219 మంది లబ్ధిదారులకు వివిధ నిర్మాణ స్థాయిని బట్టి సుమారు రూ.478.41 కోట్ల రూపాయల బిల్లులు మంజూరు అయ్యాయని చెప్పారు. వైఎస్సార్ రూరల్ హౌసింగ్ పథకం కింద 2016-17 నుండి 2019 - 2020 వరకు 4621 మంది లబ్ధిదారులకు రూ.14.91 కోట్ల మొత్తం బిల్లులను జనరేట్ చేశామన్నారు. ఈ నిధులు విడుదల కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.

జెఎన్‌టియు ప్రిన్సిపాల్‌గా ఎస్‌వి.సత్యనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం



ప్రిన్సిపల్ సత్యనారాయణకు శుభాకాంక్షలు చెబుతున్న విసి రంగజనార్ధన

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్‌గా ఇ.అరుణ క్రాంతి గురువారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపకులపతి జి. రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారన్నారు. వారి సహకారంతో ఇంజినీరింగ్ కళాశాల అభివద్ధికి తమవంతు కషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణను విసి ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గా ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, భోధన, భోధనేతర సిబ్బంది తదితరులు బాధ్యతలు చేపట్టిన వారికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

◆ డబ్బులివ్వకపోతే పెండింగే...

◆ కాసులిస్తే ఏదైనా రిజిస్ట్రేషన్

◆ నెలల వ్యవధిలోనే ఎసిబి వలలో మరో సబ్ రిజిస్ట్రార్



ఏ పనికైనా పైసలివ్వాల్సిందే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అవినీతి రహిత పాలన అందిస్తామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో ఏ పనికైనా కాసులివ్వాల్సిందేనన్న చందంగా తయారయింది సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనితీరు. సబ్ రిజిస్ట్రార్లు పోటీ పడి ప్రజల నుంచి కాసులు గుంజుతున్నారు. వరుసగా అవినీతి నిరోధక శాఖ వలలో నెలల వ్యవధిలోనే అనంతపురంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు అవినీతి నిరోధక శాఖ అధికారుల చేతికి చిక్కారు. అనంతపురం రూరల్, అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ రెండు చోట్లా ఎసిబి అధికారులకు పట్టుబడటం గమనార్హం.

కాసులిస్తేనే ఏ పనైనా... భూమి విలువను బట్టి వసూలు..

భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇది సబ్ రిజిస్ట్రార్ సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. ఏ పని జరగాలన్నా పైసలివ్వాల్సిందే. ఇవ్వకుంటే సక్రమమైందైనా ముందుకు కదలదు. డబ్బులిస్తే సరైంది కాకపోయినా పని జరిగిపోతుంది. అది కూడా ఆ ప్రాంతంలో బహిరంగ మార్కెట్‌లోనున్న ధర ప్రకారం డబ్బులు చెల్లించాలి. లేకపోతే అది పెండింగ్ రిజిస్ట్రేషన్‌లో పడిపోతుంది. ధర కుదిరితే నిషేధిత భూముల జాబితాలోనున్నా సరే పనైపోతుంది. చిన్నపాటి సవరణలున్నా కాసులివ్వాల్సిందే. వాటి కూడా పెద్ద ఎత్తునే ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో సామాన్య జనం భూముల సమస్య అంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. తాజాగా పట్టుబడిన సత్యనారాయణమూర్తి కూడా దాన విక్రయంకు లక్షల్లో డిమాండ్ చేయడం గమనార్హం. వారి ఆస్తిని వారు మరొకరికి ఇచ్చుకున్నందుకు కూడా రెండు లక్షలు డిమాండ్ చేశారు. ఇక సమస్యాత్మకమైతే ఈ ధర మరింత అధికంగా ఉంటుంది.



అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రైటర్లే ఆదాయ మార్గం

పత్రాలు రాసే రైటర్లే సబ్ రిజిస్ట్రార్లకు ప్రధాన ఆదాయ మార్గంగా ఉంటున్నారు. వారి ద్వారానే ఈ బేరసారాలు జరుగుతున్నాయి. దీనికితోడు సహాయకులను అటు రైటర్లు, ఇటు సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేకంగా నియమించుకుని వసూలు చేయడం జరుగుతోంది. అనంతపురంలో పట్టుబడిన రెండు కేసుల్లోనూ ఇదే స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రారు అల్లుడి వద్ద డబ్బులుండగా, తాజాగా పట్టుబడిన కేసులో రైటర్ సహాయకుడి వద్ద డబ్బు లభించింది. ఈ రకంగా తీసుకున్న డబ్బులను విధుల అయిపోయిన తరువాత టీ కేఫ్‌ల్లో పంపకాలు జరుగనున్నట్టు ఆరోపణలున్నాయి. కార్యాలయాల్లో అంతా సాఫీగా నడుస్తున్నట్టు కనిపించినా డబ్బుల వ్యవహారమంతా బయట కేఫ్‌ల్లో సాగుతుంటాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయలో తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు

ఎసిబి వలలో సబ్ రిజిస్ట్రార్

ముమ్మరంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

పరిశీలించిన మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈనెల 8వ తేదీన కళ్యాణదుర్గంలో జరిగే రైతు దినోత్సవ కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా అందుకు సంబంధించి బహిరంగ సభ ఇతర ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులను గురువారం నాడు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ ఎం.గౌతమి తదితరులు పరిశీలించారు. హెలీప్యాడ్, కాన్వాయ్, విఐపి గ్యాలరీలు, ప్రోటోకాల్, సిట్టింగ్, పారిశుధ్యం, విద్యుత్ తదితర ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తగి దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తగా అన్ని చర్యలూ తీసుకుని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలిసేందుకు వచ్చే ప్రతినిధులు, ప్రముఖులను గుంపులు గుంపులుగా కాకుండా వరుస క్రమంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డ్‌లోఉన్న అగ్రి ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీవో నిశాంత్ రెడ్డి, జడ్పీ సీవో భాస్కర్ రెడ్డి, గుంతకల్ ఆర్డీవో రవీంద్ర, వ్యవసాయ శాఖ జేడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, పౌర సరఫరాల శాఖ అధికారి శోభారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసీ బోర్డు ఆఫ్ స్టడీస్‌లో మార్పులు

జెఎన్‌టియు విసి రంగజనార్ధన



ఫార్మసీ బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశంలో పాల్గొన్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

ఫార్మసీ బోర్డు ఆఫ్ స్టడీస్ 5వ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు జెఎన్‌టియు విసి రంగజనార్ధన తెలిపారు. గురువారం నాడు వర్సిటీ పరిపాలన భవనంలో విసి అధ్యక్షతన ఫార్మసీ బోర్డు ఆఫ్ స్టడీస్ 5వ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ సిలబస్ రివిజన్‌తో పాటు 23 రెగ్యులేషన్ ప్రకారం హానర్స్, రీసెర్చ్ డిగ్రీలు రెగ్యులర్ డిగ్రీను ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. ఫార్మసీ సిలబస్ రివిజన్ కోసం ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్-23 రెగ్యులేషన్స్‌పై చర్చించామన్నారు. రెగ్యులేషన్స్‌లో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్స్‌ను అనుసరిస్తున్నామని చెప్పారు. వీటిలో కొంతమేరకు మార్పులుంటాయని తెలిపారు. ఈ రెగ్యులేషన్స్‌లో హానర్స్ లేక రీసెర్చ్ డిగ్రీలను, రెగ్యులర్ డిగ్రీతో పాటు ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. ఈ డిగ్రీలను పొందాలంటే అదనంగా 12 క్రెడిట్‌లను సాధించాలని తెలిపారు. ఈ సిలబస్‌లో నాలుగు ప్రొఫిషనల్ ఎలక్టివ్స్, రెండు ఓపెన్ ఎలాక్టివ్స్, స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెండు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లను రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం చివర్లో చేయాలన్నారు. వీటికి ఎనిమిది వారాల వ్యవధిని ఇస్తామని తెలిపారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. హానర్స్, రీసెర్చ్ డిగ్రీ రిజిష్టర్ చేసుకోవడానికి రెగ్యులర్ డిగ్రీలో మూడవ సెమిస్టర్ వరకు 7 జీపీఏ సాధించిన విద్యార్థులు అర్హత సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ వి.సుమలత, రెక్టార్ ఎం.విజయ కుమార్, పరీక్షలు విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి, బోర్డ్ అఫ్ స్టడీస్ ఛైర్మన్ ఎన్.దేవన్న, సభ్యులు ఆశిత్ కుమార్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కాదు పరిహాసం

◆ రైతుల గోడు పట్టించుకోని ముఖ్యమంత్రి ◆ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



విలేకరులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

జిల్లాలో ఒక్కో రైతు లక్షలాది రూపాయలు పంటలు నష్టపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరకొర పంటనష్ట పరిహారమిచ్చి రైతుల జీవితాలతో పరిహాసం ఆడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన రైతులతో కలిసి రాయదుర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పంటల బీమాను చూస్తే రైతుల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని చెప్పారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా వాతావరణ బీమా కింద కేవలం రూ. 213 కోట్లు మంజూరైందన్నారు. 2017లో తెలుగుదేశం ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాకు దాదాపు రూ.1100 కోట్ల సహాయాన్ని అందించిదని గుర్తు చేశారు. డి.హీరేహాల్ మండలం హులికల్లు గ్రామంలో 20 మంది రైతులకు కేవలం రూ.3,148 మాత్రమే పరిహారం ఇచ్చారన్నారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. పదులు, వందల రూపాయలను పంచడానికి ముఖ్యమంత్రి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి జిల్లా పర్యటనకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. 2018 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1838.24 కోట్లు విడుదల చేస్తానని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. అందులో రూ. 931 కోట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకే పరిహారం కింద అందాల్సి ఉందన్నారు. ఈ ప్రకటన చేసి నాలుగేళు గడుస్తున్నా ఆ పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పరిహారం ఎగ్గొట్టి రైతుల కడుపుకొడుతున్న జగన్ రెడ్డికి అనంతపురం జిల్లాలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు జమీల్ ఖాన్, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు మోహన్ రెడ్డి, ఇనాయత్, ఎంపీటీసీ గంగాధర పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం




విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున హెచ్చరించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సామాన్య, బడుగు బలహీన వర్గాల ప్రజలు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే విపరీతంగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగాయన్నారు. పోలవరం నిర్వాసిత బాధితులకు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉపాధి కల్పన కల్పిస్తామనే జగన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలుగేళ్ల తన పాలన పూర్తయినప్పటికీ నేటికీ ఒక్క టిడ్కో ఇంటిని పూరి చేసిన పాపానపోలేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించిన తర్వాతే సిఎం జగన్ జిల్లాలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ సిఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి జి.మధు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శివ, నాయకులు తిమ్మరాజు, అంజి, నాగరాజు, శంకర్, రమేష్, కృష్ణానాయక్, నాగేంద్రనాయక్, బి.ఆంజనేయులు, ఆటో అంజి, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం

ప్రజాశక్తి-రాయదుర్గం



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం

తొలగించిన కరోనా సమయంలో పని చేసిన 16 మంది కార్మికులతోపాటు అదనంగా తీసుకున్న మరో 9మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు నాలుగోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతటా కరోనా మహమ్మారికి భయపడి ప్రజలంతా ఇళ్లలో ఉంటే వారి ప్రాణాలను రక్షించడం కోసం తమ కుటుంబ సభ్యుల ప్రాణాలను తమ ప్రాణాలను సైతం లెక్కజేయకుండా సేవలు చేయడానికి ముందుకొచ్చిన కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెద్ద డ్రెయినేజీ కాలువలలో పూడికతీత కోసం అదనంగా తీసుకున్న తొమ్మిది మంది కార్మికులను కూడా తొలగించారన్నారు. ఆయా కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో ఈనెల 8న కళ్యాణదుర్గానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. వీరికి ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, సిపిఎం పట్టణ సహాయ కార్యదర్శి జి.మధు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, తదితరులు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

అన్ని పంటలకూ బీమాను వర్తింపజేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ



వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున రైతుసంఘం నాయకులు

రైతులు పండించే అన్ని పంటలకూ వాతావరణ బీమాను వర్తింపజేయాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ డివిజన్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవలం కొంతమంది రైతలకు, కొన్ని రకాల పంటలకే బీమాను వర్తింపజేయడం బాధాకరమన్నారు. అధిక శాతం రైతులు సాగు చేసే పంటలకు బీమాను వర్తింపజేయకపోవడం వల్ల చాలామంది రైతులు నష్టపోయారన్నారు. పంటల బీమా వర్తింపులో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. కాగా బీమాలో న్యాయం చేయాలని రైతులు పోరాటం చేస్తే అక్రమ కేసులు బనాయించడం బాధాకరమన్నారు. ప్రశ్నించేతత్వాన్ని అణచివేసే ధోరణి మంచిది కాదన్నారు. 20021-22 సంవత్సరానికి సంబంధించిన రైతుల బీమా, నష్టపరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చిరుధాన్యాలను పూర్తి సబ్సిడీతో రైతులకు మంజూరు చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో రైతులను కలుపుకుని ఆందోళనలకు శ్రీకారం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ప్రసాద్, మారెప్ప, కాసీం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన శ్రీసత్యసాయి కార్మికుల నిరసన

అనంతపురం కలెక్టరేట్ : బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికుల చేపట్టిన నిరసనలు గురవారం 2వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ పలుసార్లు సమ్మెలు నిర్వహించామన్నారు. సమ్మె సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హామీలిచ్చి సమ్మె విరమింపజేస్తున్నారు తప్ప పరిష్కరించడం లేదన్నారు. సిఎం జగన్ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో కార్మికుల బాధలు తెలియజేస్తే పరిష్కారం అవుతాయన్న ఆశతో తప్పని పరిస్థితుల్లో సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. అధికారులు చర్చలతో సరిపెట్టాలని చూస్తున్నట్లు ఉందని, పైగా నిరసన విరమించకపోతే చర్యలు ఉంటాయన్న బెదిరింపు ధోరణి అనుసరించడం బాధిస్తోందన్నారు. ఇలాంటి వైఖరి వీడి సమస్యల పరిష్కరించి కార్మికులను సమ్మె విరమింపజేయాలన్నారు. నేడు శ్రీసత్యసాయి బోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



సిడిపిఒ డీల్లేశ్వరికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : అంగన్‌వాడీలు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్షుడు ఎ.మల్లేష్, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుత్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు గంగమ్మ, కార్యదర్శి రేష్మాభాను డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనంతో కూడిన మెడికల్ సెలవులనుకల్పించాలన్నారు. 2017 నుంచి టిఎ, డిఎ లు ఇవ్వాలన్నారు. నూతన కుక్కర్లు, గ్యాస్ స్టవ్‌లు ఇవ్వాలన్నారు. ఈనెల 10,11వ తేదీల్లో జరిగే ధర్నాల్లో పాల్గొంటామన్నారు. అనంతరం సిడిపిఒ డీల్లేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.శోభారాణి, బి.పార్వతి, ఎన్.గంగాదేవి, ఆర్.ఆనందమ్మ, ఎ.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ యుగంధర్ - డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

డెంగీ వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ యుగంధర్ పిలుపునిచ్చారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలో మహార్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగు తల్లి విగ్రహం వరకూ సాగి తిరిగి పెద్దాసుపత్రికి చేరుకుంది. అక్కడ మానవహారంగా ఏర్పడి డెంగీ నివారణకు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి ప్రాణాంతకమన్నారు. అయితే చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరి చేరదన్నారు. ముఖ్యంగా దోమలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఇందులో భాగంగా ఇంట్లో నీరు నిలువ ఉంచుకునే ట్యాంకులు, నీటి తొట్టెలు, డ్రమ్ములు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ కన్సెల్ట్ కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, డాక్టర్ మనోజ్‌కుమార్, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, మాస్ మీడియా అధికారి ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ మారుతీప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, గిరిధర్ రెడ్డి, సూర్‌బాషా, శ్రీధర్, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వార్డ్ హెల్త్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దయాకర్, సబీహా సుల్తానా మాట్లాడుతూ తీవ్రమైన తలనొప్పితో కూడిన జ్వరం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే జ్వరం వచ్చిన వెంటనే డెంగీగా భయపడకూడదన్నారు. జ్వరాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా చేసుకోవడం, వారానికి ఒకసారి డ్రై డే పాటించడం, పూలకుండీలు, కూలర్లలో తరచూ నీరు మార్చడం, ఇంటి కిటికీలకు దోమలు రాకుండా మెష్ కొట్టించడం, పిల్లలు, పెద్దలు శరీరం పూర్తిగా కప్పబడే విధంగా దుస్తులు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరయ్య, సిహెచ్ఒ షమీం తారా, పిహెచ్ ఎన్.తులసమ్మ, సూపర్‌వైజరు వెంకటరత్నమ్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ యుగంధర్



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

నేరాలు ఘోరాలు

విద్యార్థికి పాముకాటు

యాడికి : మండలంలోని నగరూరు హైస్కూల్ విద్యార్థి బుధవారం పాముకాటుకు గురైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పెద్దమడుగూరు మండలం, కోనాపురం గ్రామానికి చెందిన హరినాథ్ నగరూరు హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన హరినాథ్ పాఠశాల తరగతి బయట బూట్లు వదిలి లోపలకు వెళ్లాడు. అయితే బూట్ల వద్దనే ఉన్న ఒక చిన్నపాముపై హరినాథ్ గమనించక కాలుపెట్టాడు. దీంతో పాము బాలుని కాలు పై కాటు వేసింది. వెంటనే వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని ఆరాతీశారు.

ఇళ్ల నిర్మాణాల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

తాడిపత్రి రూరల్ : ఇళ్ల నిర్మాణాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ గౌస్‌మహమ్మద్‌కు స్థానికులు గురువారం ఫిర్యాదు చేశారు. రూరల్ పరిధిలోని ఆటోనగర్ పక్కన 2005లో ఆటోనగర్ కార్మికులు, మైనారిటీలు, వివిధ ప్రతిభావంతులకు ఇంటి పట్టాలని ఇచ్చారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ స్థలాలను వేరొకరికి ఇవ్వడంతో పలువురు లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చింది. అయితే బుధవారం కొందరు అధికార పార్టీ రాజకీయ నాయకుల ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు లోపాయకారి సహకారంతో ఇటీవల కట్టుకున్న నిర్మాణాలు, పునాదులు, బేస్ మట్టం, గోడలను జెసిబితో కూల్చారని, అక్రమంగా చొరబడి ఇష్టానుసారం కూలగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో డి.షరీఫ్, షేక్ గౌసియా, రాబియా, షేక్ షరీఫ్, ఆటోనగర్ కార్మికులు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడిపత్రి రూరల్ : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈశ్వరరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని గన్నేవారిపల్లి వద్ద అక్రమంగా బొలెరో పికప్ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 53 ప్లాస్టిక్ బస్తాల్లో రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. బియ్యం బస్తాలను తూకం వేయగా 30.90 టన్నుల ఉన్నట్లు తెలిపారు. వెంటనే వాహనంతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే బియ్యాన్ని తాడిపత్రి ఎఫ్‌ఎల్‌ఎస్ గోడౌన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అనంతపురం విజిలెన్స్ సీఐ వెంకటరమణ, ఎఇఇ రవీంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం

ప్రజాశక్తి-గుంతకల్లు

సిఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎటిఎం.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవనంలో యూనియన్ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్మికులకు రావాల్సిన సరెండర్ లీవ్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, ఓపిఎస్ విధానాన్ని ప్రారంభించాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎల్.జగదీష్, కార్యదర్శి కె.నరసయ్య, నాయకులు కొండయ్య, కృష్ణ, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్ స్వాగత పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 8వ తేదిన జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా స్వాగతం పలుకుతూ జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌లను గురువారం ఆవిష్కరించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి తదితరులు హాజరై పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అవినీతి రహిత పరిపాలన సాగిస్తూ ప్రజల వద్ద పాలన అందించి మహాత్మాగాంధీ ఆశయం గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారని తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజాధరణ పొంది చరిత్ర సృష్టించారన్నారు. అలాంటి ముఖ్యమంత్రి మరో 10 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించేలా ప్రజలు మద్ధతుగా నిలస్తారని తెలిపారు. అందులో భాగంగా జిల్లాకు వస్తున్న సందర్భంగా స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.



సిఎం జగన్ స్వాగత పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

'గడపగడపకూ' వాయిదా

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో ఈనెల 7న నిర్వహించాల్సిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న కళ్యాణదుర్గంలో సిఎం పర్యటన ఉండటంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10న తిరిగి గడప గడపకూ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

దళితులపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి-కుందుర్పి

దళితులపై చిన్నచూపు చూస్తే ఊరుకోమని ఎంపిపి కమల నాగరాజు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత మహిళా తహశీల్దార్ కావడంతోనే అధికార పార్టీ నాయకులకు అండగా ఉంటోందని మాజీ సర్పంచి పెద్ద నరసింహప్ప మాట్లాడడం సిగ్గుచేటన్నారు. టిడిపి హయాంలో మాదిరి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అక్రమాలు జరగలేదన్నారు. అధికారులతో పనులు చేయించుకోవాలేగానీ, అధికారులకు పార్టీల పేర్లు రుద్దడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు పద్ధతి మార్చుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల జెఎసి కన్వీనర్ ఈ రాము, జంబుగుంపుల గ్రామ సర్పంచి గంగాధర, కురుబ సంఘం మండల అధ్యక్షులు కె.పి.గోపాల్, కెంచంపల్లి వార్డ్ మెంబర్ నాగభూషణ, వైసిపి యువ నాయకుడు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

శింగనమల : అనంతపురంలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పంటలు నష్టపోయిన అర్హులైన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా అంబాజీరావు

రాయదుర్గం : లయన్స్ క్లబ్ రాయదుర్గం శాఖ అధ్యక్షుడిగా వి.అంబాజీరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పూర్వ అధ్యక్షులు ధనార్జన నుంచి అంబాజీరావు నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా పేర్మి సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ముసుగులో 'కేశవ్' డ్రామాలు

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం - మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులపై కేసులు నమోదు చేశారంటూ పబ్లిసిటీ స్టంట్ కోసం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మొసలి కన్నీరు కారుస్తూ డ్రామాలు చేయడం కట్టిపెట్టాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హితవు పలికారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నేతలపై పోలీసులు కేసులు నమోదు చేస్తే రైతులపై నమోదు చేశారని కేశవ్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. రైతుల కోసం గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని సంక్షేమ పథకాలు సిఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. రైతులకు ఏదైనా కష్టం వస్తే పరిష్కరించేందుకు అందరికన్నా ముందుగా మేమే ఉంటామన్నారు. జగన్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత, హక్కు కేశవ్‌కు లేదన్నారు. గతేడాది అత్యధికంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.850 కోట్లకు పైగా బీమా అందించామన్నారు. సీజన్ల వారీగా ఆ సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు సకాలంలో అందించిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం మీరు రెచ్చగొడితే రెచ్చిపోయే పరిస్థితుల్లో రైతులు లేరన్నారు. ఏదేమైనా రైతుల పట్ల తాము ఉదారంగా వ్యవహరిస్తామని, నిజమైన రైతులపై నమోదు చేసిన కేసులు విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సిఎం పర్యటన విజయవంతం చేయండి

సిఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. దివంగత సిఎం వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే రైతు దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గంలో రైతుసభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో 2022 ఖరీఫ్‌నకు సంబంధించి వాతావరణ బీమా, ఫసల్ బీమా సొమ్మును విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి నరసింహులు వైస్ సర్పంచి వన్నప్ప, వార్డు మెంబర్ వసికెరి మల్లికార్జున,బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంఇపిపి చంద్రమ్మ, వైస్ సర్పంచు పెన్నోబిలం ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, వైసిపి నాయకులు బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగేలా సుదీర్ఘంగా పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గద్దెనెక్కిన తర్వాత విస్మరించారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుత్తి మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి బాల రంగన్న, నాయకులు కె.ఆంజనేయులు, బి.నాగేంద్ర, హరి, పుల్లన్న, సుధాకర్, జి.నాగరాజు, టి.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం

పెంపుడు జంతువులకు టీకాలు వేయించుకోండి

ప్రజాశక్తి-నార్పల

ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని వైస్ ఎంపిపి వెంకటలక్ష్మి సూచించారు. ప్రపంచ జూనాటిక్ డే సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంపుడు కుక్కలను పెట్టుకున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా టీకాలు వేయించాన్నారు. ఇందులో భాగంగా వైద్యశాలకు వచ్చిన 15 కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అలాగే 20 ఆడదూడలకు బ్రూషల్లా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గోవిందరాజులు, పశు వైద్య సిబ్బంది చంద్రకళ, గోపలమిత్రలు కాటమయ్య, రాజారెడ్డి, జయరాం, శివప్రసాద్, డిప్లొమా ట్రైనింగ్ విద్యార్థులు అరవింద్, హంస, నయన పాల్గొన్నారు. అలాగే బి.పప్పూరు పశువైద్యశాలలో రాధిక ఆధ్వర్యంలో 20 కుక్కలకు రేబీస్, 10 ఆడదూడలకు బ్రూషల్లా వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు గురువారం టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పెంపుడు జంతువులతోపాటు పశువులకు రేబీస్, ఇతర వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉద్దేహాళ్ రాజప్ప, కురువల్లే నరేంద్ర, గోనెహాళ్ బాలాజీనాయక్, నెమకల్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాల్‌లో కుక్కకు టీకా వేస్తున్న వైద్యులు

'స్త్రీశక్తి'తో బాలికలకు భరోసా

ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

స్త్రీ శక్తి పథకం ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యం భరోసా ఉంటుందని ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి పథకంపై కళాశాల ప్రిన్సిపాల్ మమతా అధ్యక్షతన బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ శక్తి పథకం ద్వారా 50 మంది బాలికలకు యోగా, మరో 50 మంది బాలికలకు కరాటే విద్యను ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా బాలికలు మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉండడమే కాకుండా సమాజంలో ఎదురయ్యే పలు సమస్యలను స్వతంత్రంగా ఎదుర్కొనడానికి మనోస్థైర్యాన్ని నింపేలా ఈ శిక్షణ వారి దైనందిక జీవితాలలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం 50 మంది విద్యార్థినులకు యోగా మ్యాట్‌తో పాటు కరాటే దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి ఏరియా టీమ్ లీడర్ నల్లపురెడ్డి, ప్రాజెక్టు హెడ్ హుస్సేన్ బీ, కళాశాల ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పద్మావతి, కళాశాల సిబ్బంది ప్రసాద్‌రెడ్డి, వాసవీ, లత, అరుణ, యోగా గురువు సునీత, కరాటే మాస్టర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి

సంక్షేమ విప్లవం తీసుకొచ్చిన వైఎస్ఆర్

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దుక్కుతుందని రాష్ట్రప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కొనియాడారు. అమెరికాలోని ఫీనిక్స్‌లో వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో చిత్రపటానికి పూలామల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయే వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పేదవాడి గుండె చప్పుడు బాగా తెలిసిన వ్యక్తి మన తెలుగువాడు కావడం సంతోషకరమన్నారు. అంతేగాకుండా తెలుగువారికి బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. తెలుగు జాతి ఉన్నంత కాలం రాజశేఖరెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. ఆయన అడుగు జాడల్లోనే ప్రస్తుతం సిఎం జగన్ నడుస్తున్నారన్నారు.



వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎన్ఆర్ఐలు

పుట్లూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని ఫ్యాక్షన్ గామాల్లో పరిస్థితి, మక్కా, జూదం వంటి వివరాలను స్థానిక సిఐ వేణుగోపాల్, ఎస్ఐ వెంకటప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు చోటు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మట్కా, జూదంపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించారు. అలాగే ఎక్కడైనా గొడవలు జరిగే గ్రామాల్లో ఎప్పటికప్పుడు తెలుసుకుని అవగాహన కల్పించాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శివారెడ్డి

నేడు 'రైతుకోసం' టిడిపి ధర్నా

అనంతపురం : జిల్లాలో పంట నష్ట పరిహారం అందించడంలో వైసిపి ప్రభుత్వం విఫలం కావడాన్ని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు సిఎం జగన్ తాము అధికారంలోకి వస్తే తామే బీమా చెల్లించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నేడు నష్టపోయిన రైతుకు నష్టపరిహారం చెల్లించడంలో పూర్తిగా అన్యాయం చేశారన్నారు. అంతేగాకుండా పంట నష్టపరిహారం కోసం రైతులు కూడేరు మండలంలో రోడ్డెక్కితే పోలీసులు కర్కషంగా అక్రమ అరెస్టులతోపాటు కేసులను పెట్టడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా నేడు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు పెద్దఎత్తున రైతులు, టిడిపి కుటుంబ సభ్యులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తాగునీటి పథకం ప్రారంభం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నురుబీ, కౌన్సిలర్ వాల్మీకి శివ గురువారం ప్రారంభించారు. వార్డులో తాగునీటి సమస్య ఏర్పడడంతో రూ. లక్షలు వెచ్చించి తాగునీటి బోరు, మూడు స్పాట్ డెలివరీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. వాటిని పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, డిఇ ఇంతియాజ్, కౌన్సిలర్ ఫారుక్, నాయకులు గురు ప్రసాద్ యాదవ్, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

రాయదుర్గం : పట్టణంలోని 5వ వార్డులో రహీమాబీ గురువారం అనారోగ్యంతో మృతిచెందడంతో వైఎస్ఆర్ బీమా పథకం కింద మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, వైస్ ఛైర్మన్ జి.వలిబాషా మృతురాలి చెల్లెలకు గురువారం తక్షణసాయం కింద రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మట్లాడుతూ మిగిలిన రూ.90వేలను త్వరలో నామినీ బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శివకుమార్, దేవరాజు, మంజునాథ, కో ఆప్షన్ సభ్యులు నజీర్, వార్డు ఇన్‌ఛార్జి శివ, శ్రీరామరెడ్డి, కృష్ణమూర్తి, నిజాముద్దీన్, రవి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

నార్పల : మండల పరిధిలోని శిద్ధరాచర్ల రైతు భరోసా కేంద్రంలో రైతులకు గురువారం కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో షెడ్యూల్ కులాల రైతులకు మంజూరైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధకులు నటరాజ్, సర్పంచి సాకే రామాంజనేయులు, హార్టికల్చర్ అసిస్టెంట్ కుపేంద్ర, శశి, మాజీ సర్పంచి నారాయణ, రైతులు పాల్గొన్నారు.

పలువురు డైరెక్టర్లు బాధ్యతల స్వీకరణ

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటీ డైరెక్టర్లుగా ఆర్.కిరణ్మయి, ఫారెన్ అఫైర్స్ డైరెక్టర్‌గా పి.సుజాత, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా వి.బి.చిత్ర, ఎకనామినేషన్ బ్రాంచ్ అడిషినల్ కంట్రోలర్‌గా జె.శ్రీనివాసులు, కళాశాల సివిల్ విభాగం విభాగ అధిపతిగా అజిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించారన్నారు. వాటిని సక్రమంగా నిర్వహిస్తామన్నారు.



డైరెక్టర్లను అభినందిస్తున్న విసి రంగజనార్ధన

బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లాకేంద్రంలోని వైసిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించడంతోపాటు సమసమాజ స్థాపన కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన బాటలో నడిచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర బిసి కమిషన్ మెంబర్, రిటైర్డ్ జడ్జి క్రిష్టప్ప, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్టీసీ రీజినల్ ఛైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, రజక కార్పొరేషన్ ఛైర్మన్ రంగన్న, ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, బీసీ విభాగం జోనల్ ఇన్‌ఛార్జి బీసీ రమేష్, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, శ్రీదేవి, సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, పామిడి వీరాంజినేయులు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతపురంలో బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ఉరవకొండ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని అర్బన్ సిఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

యాడికి : బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం ముంగిట చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లయ్య, నరసింహులు, సూర్యుడు, టైలర్ పుల్లయ్య, రామాంజనేయులు, ఉప్పలపాడు వెంకట రాముడు, అగ్గి రాముడు, ఆటో ఓబులేసు, సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగానే సిఎం జగన్ సచివాలయాల ద్వారా ప్రజలందరికీ నవరత్నాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి రుసుం లేకుండా 11 రకాల సర్టిఫికెట్లను అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వారిని గుర్తించి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, మండల ఉపాధ్యక్షులు బందలదిన్నె రామయ్య, ఎంపిటిసి అనిల్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న సురక్ష కార్యక్రమాని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మోహన్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని దోసలేడు సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అలాగే అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకుంటే ప్రస్తుతం దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శులు, వాలంటరీలు, సచివాలయం, సిబ్బంది పాల్గొన్నారు.


బుక్కరాయసముద్రం మండలంలో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న నాయకులు, అధికారులు

'జగనన్న సురక్ష'లో నాయకులు


పెద్దపప్పూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

బొమ్మనహాల్ : మండల కేంద్రంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లను అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షకీలాబేగం, పంచాయతీ కార్యదర్శి రవి, పయ్యావుల సత్తన్న, ఫొటో స్టూడియో బసవరాజ్, నాయుడు, సూరి, నీళ్ల రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని అనంతసాగర్ కాలనీ సచివాలయం-3లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటిసి నీలం భాస్కర్, సర్పంచి పార్వతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకుడు జగనన్న అన్నారు. ఏ ఒక్కరూ మాకు అర్హత ఉండి పథకాలు అందడం లేదనే మాట రాకూడదన్నారు. అందుకోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి, ఉప సర్పంచి, మండల ప్రత్యేకాధికారి, ఇఒఆర్‌డి దామోదరమ్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

8న చలో కళ్యాణదుర్గం

ఉరవకొండ : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సాగునీటి అవసరాలకు సంబంధించిన ప్రాజెక్టులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌కు విన్నవించేందుకు ఈనెల 8న చలో కళ్యాణదుర్గం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, ఉరవకొండ పార్టీ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, సీనియర్ నాయకులు చెన్నారాయుడు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టులపై ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులందరికీ బీమా, నష్టపరిహారాన్ని అందజేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి వద్దకు చలో రైతు పోరుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

వైఎస్ఆర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని వరదాయపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు గుండెల్లో నిలిచిపోయిన మహానేత వైఎస్ఆర్ అని కొనియాడారు. రైతుల పక్షపాతి అయిన రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరదాయపాలెం శివారెడ్డి, జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, రమేష్‌రెడ్డి, నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా నాగేష్

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నాగేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలంగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. పీడీగా చేసిన సమయంలో ఎంతోమంది విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఎనలేని కృషి చేశారు. తిరిగి ఆయన బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా రావడం పట్ల స్థానికులు, క్రీడాకారులు హర్షం చేస్తున్నారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లారెడ్డి బెలుగుప్ప మండల విద్యాధికారిగా బదిలీపై వెళ్లారు. అదేవిధంగా నార్పల ప్రభుత్వ బాలుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న శ్రీదేవి పదోన్నతిపై విద్యాధికారిణిగా పెద్దపప్పూరు మండలానికి వెళ్లడంతో రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

శింగనమల : అనారోగ్యంతో మృతిచెందిన మండల కేంద్రంలోని బోయ వీధికి చెందిన పెద్ద నాగముని కుటుంబానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా పెద్ద నాగముని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.వెంకటేష్, కుళ్లాయప్ప, కాయల సురేష్‌యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్‌గౌస్, ముంతా వెంకటేష్, చిన్న ఎర్రిస్వామి, దాసంగం నాగేంద్ర, బెస్త ఓబుళేష్, విజయ్, బోయ నరేష్, బొజ్జప్ప పాల్గొన్నారు.

కరణం విరుపాక్షిరెడ్డికి నివాళి

ఉరవకొండ : విడపనకల్ మండలం గడేకల్ గ్రామానికి చెందిన కరణం విరుపాక్షి రెడ్డి (58) మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఖోఖో సంఘం జిల్లా ప్రెసిడెంట్ వై.భీమరెడ్డి, ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్ వేర్వేరుగా గురువారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, ఉపసర్పంచి తిమ్మాపురం రాముడు, వైసిపి నాయకులు లింగన్న, కేశవ, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి, ఉమాశంకర్, మంగళ రవి, తదితరులు ఉన్నారు.

పేదల పక్షపాతి సిఎం జగన్

ప్రజాశక్తి-గుత్తి

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపురం, కరిడికొండ గ్రామాల్లో సర్పంచులు ఎం.చంద్ర, కె.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేతోపాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో సిఎం జగన్ నవరత్న పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అంతేగాకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తామన్నారు. చంద్రబాబును నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, వైసీపీ సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కోనా మురళీధర్‌రెడ్డి, బేదల వెంకటరాముడు, గురుప్రసాద్, మల్లయ్యయాదవ్, బి.రమేష్‌రెడ్డి, ఎన్.సి.రంగయ్య, కృష్ణమోహన్‌నాయుడు, నాగరాజు, హనుమంతు, మహలింగ, టి.సురేష్‌బాబు, మల్లికార్జున, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరద, రమణ, నరేష్, సర్పంచి చిదంబరి, తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ'లో ఎమ్మెల్యేలు


గుత్తి మండలంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

శింగనమల : ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పద్మావతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్నమట్లగొంది గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సిఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి నిత్యం ప్రజల కోసం పని చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సింగిల్‌విండో అధ్యక్షులు శ్రీరామిరెడ్డి, వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎఒ అన్వేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీనివాసులు, వైసిపి కోరే రాముడు రాధాకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శింగనమలలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి